Follow: @ANNTELUGU

REGISTERED NUMBER
APTEL/2014/58382

02-01-2026

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 9 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శుక్రవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## ధురంధర్ చిత్రానికి కేంద్రం షాక్

**రణ్‌వీర్ సింగ్ ధురంధర్ చిత్రంలో కీలక మార్పులు**


**మహా:** బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఇప్పటికే 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రంగా రికార్డు సృష్టించిన ఈ సినిమాను, కొన్ని కీలక మార్పులతో థియేటర్లలో రీరిలీజ్ చేశారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శాఖ ఆదేశాల మేరకు మార్పులు చేశారు. ఈ చిత్రంలో కొన్ని పదాలను, డైలాగులను తొలగించాలని కేంద్రం చిత్ర బృందానికి సూచించింది. ఈ మేరకు డిస్ట్రిబ్యూటర్లు డిసెంబర్ 31న దేశవ్యాప్తంగా ఉన్న థియేటర్ యాజమాన్యాలకు ఈమెయిల్స్ పంపారు. పాత ప్రింట్ స్థానంలో మార్పులు చేసిన కొత్త డిజిటల్ సినిమా ప్యాకేజీని డౌన్‌లోడ్ చేసుకుని, జనవరి 1 నుంచి ప్రదర్శించాలని కోరారు. ఇందులో రెండు పదాలను మ్యూట్ చేయగా, ఒక డైలాగ్‌ను మార్చారు. 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ చిత్రం పాకిస్థాన్ సామాజిక ఘర్షణలు, ఉగ్రవాదానికి, ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య ఉన్న సంబంధాల నేపథ్యంలో సాగుతుంది. ఇందులో రణ్‌వీర్ సింగ్‌తో పాటు అర్జున్ రాంపాల్, అక్షయ్ ఖన్నా, ఆర్.మాధవన్, సంజయ్ దత్ వంటి భారీ తారాగణం నటించింది. ఈ కథ వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన కల్పిత గాథ అని సెన్సార్ బోర్డు ఇప్పటికే స్పష్టం చేసింది.

**టాప్ న్యూస్**



కేసీఆర్, హరీష్‌రావు
### చెప్పేవన్నీ అసత్యాలే
- మంత్రి ఉత్తమ్ ఫైర్

02



కేసీఆర్ ను ఉరితీయాలంటూనే
### మర్యాద పాటిస్తానంటావా?
- సీఎం నోటినుండి టన్నుల కొద్దీ అబద్ధాలు
- సీఎం కామెంట్స్ పై మాజీ మంత్రి హరీష్ రావు రియాక్షన్

02



కేరళ పాలిటిక్స్‌పై
### మోదీ కామెంట్స్
- యుడిఎఫ్ ఎల్ డిఎఫ్ ఫిక్స్‌డ్ మ్యాచ్
- త్వరలో ముగింపు

02



# కేసీఆర్ హరీష్‌ను ఉరితీసినా తప్పులేదు

## కేసీఆర్ నిర్ణయాలతోనే ఏపీకి నీళ్ళు

ఏనాడూ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో వాదనలు వినిపించలేదు

రూ.32 వేల కోట్ల ప్రాజెక్టును రూ.80 వేల కోట్లకు పెంచారు

బీఆర్ఎస్ మనుగడ ప్రశ్నార్థకమైందనే నీళ్ళ డ్రామా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్, మహా :** పాలమూరురంగారెడ్డిపై విచారణ చేపట్టి తప్పు ఎవరిదో తేలుస్తామనేసరికి బీఆర్ఎస్ డైవర్షన్ పాలిటిక్స్‌కు దిగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తిరిగి తమనే ఏపీకి తెలంగాణ నీళ్లు తాకట్టు పెట్టామంటూ ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ ఏపీకి ఎవరైనా నీళ్లిస్తారా అని ప్రశ్నించారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి కంటే కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ దుర్మార్గులని అన్నారు. కేసీఆర్, హరీష్ రావును ఉరేసినా తప్పులేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇదే తప్పు మిడిల్ ఈస్ట్ దేశాల్లో చేస్తే రాళ్లతో కొట్టి చంపేవాళ్లని పేర్కొన్నారు. ఉమ్మడి పాలకుల కంటే కేసీఆరే తెలంగాణ అన్యాయం చేశారని మండిపడ్డారు. గురువారం ప్రజాభవన్‌లో కృష్ణా, గోదావరి బేసిన్ అంశాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణాలో 550 టీఎంసీల నీళ్లు ఇవ్వాలనే వాదనను అసలు కేసీఆర్ వినిపించలేదని ఆరోపించారు. నీటి వాటా కోసం అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో వాదనను వినిపించలేదని తెలిపారు. కేసీఆర్ నిర్ణయాలతో నేడు ఏపీకి ఎక్కువ నీళ్లు వెళ్తున్నాయని అన్నారు. జూరాల నుంచి శ్రీశైలానికి పాలమూరును మార్చడంతో నీళ్ల విషయంలో ఏపీకి కేసు వేసే అవకాశం వచ్చిందని అన్నారు.

మిగతా 2లో

### ఆదిత్యనాథ్ ఎంపిక అందుకే...

హరీష్ రావు ఇరిగేషన్ శాఖలో కనీసం డాక్యుమెంట్లు కూడా కనిపించకుండా చేశారని సీఎం ఫైర్ అయ్యారు. ఇరిగేషన్ శాఖలో ఆదిత్యనాథ్ దాస్ పూర్తి అనుభవం ఉన్న అధికారి అని, తెలంగాణలో అన్ని ప్రాజెక్టులపై దాస్‌కు అవగాహన ఉందన్నారు. 2004-14 మధ్య దాస్ తెలంగాణ ప్రాజెక్టులకు ఇన్ ఛార్జిగా ఉండగా, జోషి ఏపీ ప్రాజెక్టులకు ఇన్ ఛార్జిగా ఉన్నారని.. విభజన సమయంలో ఆయన తెలంగాణ కోరుకున్నా, ఏపీకి పంపారన్నారు. పదవీవిరమణ అనంతరం తెలంగాణ ప్రాజెక్టులపై అనుభవం ఉన్న ఆయనను సలహాదారుగా తీసుకున్నామని అన్నారు. ఆయనది ఏపీ, తెలంగాణ కాదని, బిహార్ రాష్ట్రానికి చెందిన వారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




## సిగరెట్, పాన్ మసాలాపై 40 శాతం జీఎస్టీ

**ఫిబ్రవరి 1 నుండి అమలు**

**మహా:** సిగరెట్లు, పాన్ మసాలా, పొగాకు సంబంధిత ఉత్పత్తులపై 40 శాతం, బీడీలపై 18 శాతం జీఎస్టీని కేంద్రం విధించింది. ఈ పన్నుతో పాటు పాన్ మసాలపై ఆరోగ్య, జాతీయ భద్రత సెస్ పెంచింది. అలాగే పొగాకు సంబంధిత ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం వేసింది. ఫిబ్రవరి 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని తెలిపింది. కేంద్రం తాజాగా నోటిఫికేషన్ జారీ చేయడంతో ప్రముఖ సిగరెట్ కంపెనీలపైన ఐటీసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ షేర్లు పడిపోతున్నాయి. ఫిబ్రవరి ఒకటి నుంచి ఆ ఉత్పత్తుల ధరలు పెరగనుండటంతో అమ్మకాలు తగ్గే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఈ స్టాక్స్ నష్టాల్లోకి వెళ్లిపోతున్నాయి.

## జర్నలిస్టుల సంక్షేమానికి అండగా ఉంటాం

హైదరాబాద్ ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ ప్రెస్ క్లబ్ 2026 సంవత్సరానికి రూపొందించిన నూతన డైరీ ని ముఖ్యమంత్రి ఏ .రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. సచివాలయంలోని ఆయన కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని, వారి సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. జర్నలిస్టులను అన్ని విధాల ఆదుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ .రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్దేల్లిబాపూరావు, ఈసీ సభ్యులు ఎస్ .ఉమాదేవి, మర్యాద రమాదేవి, రాజేశ్వరి కళ్యాణం, శంకర్ సిగ, ముత్యాల సత్తిబాబు, నాగరాజు వనం, ఎన్. శ్రీనివాసరెడ్డి ,అశోక్ దయ్యాల, అమిత్ బట్టు సహా హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పూర్వ ప్రధాన కార్యదర్శి ఆర్. రవి కాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## బంగ్లాలో హిందువులపై ఆగని దాడులు

వివరాలు 2లో

## గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ

నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై చర్చ

అసెంబ్లీలో నీళ్ళనిజాలు ప్రజల ముందుంచుతున్నామని వెల్లడి

హైకోర్టు సీజేను కలిసిన సీఎం.. సీఎంకు మంత్రులు, అధికారుల శుభాకాంక్షలు



**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో మర్యాదపూర్వకంగా భేటీ అయి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై, ప్రభుత్వపరంగా నూతన సంవత్సరంలో చేపడుతున్న కొత్త నిర్ణయాలపై చర్చించారు. అసెంబ్లీ నిర్వహణపైనా వివరణ ఇచ్చారు. నీటిపారుదల రంగంపై అసెంబ్లీలో పీపీటీ ఇవ్వనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలకు నీళ్ళపై నిజాలు అసెంబ్లీలో వివరించబోతున్నామని, గత పదేళ్ళలో జరిగిన అంశాలపైనా డాక్యుమెంట్లు ప్రజలకు వివరిస్తామన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా హైకోర్టు సీజేను కూడా కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

### సీఎంకు శుభాకాంక్షల వెల్లువ

నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు, ఎమ్మెల్యేలు, అధిరారులు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ తదితరులతో పాటు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. డిజిపి శివధర్ రెడ్డి, హైడ్రా,జీహెచ్ఎంసి కమిషర్లతో పాటు అధికారులు శుబాకాంక్షలు తెలిపారు.

## రూ..2.5 కోట్ల ప్యాకేజితో చరిత్ర సృష్టించిన ఐఐటీ హైదరాబాద్ విద్యార్థి

- మరో కంప్యూటర్ సైన్స్ విద్యార్థి రూ. 1.1 కోట్ల ప్యాకేజీ



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ హైదరాబాద్) విద్యార్థి భారీ ప్యాకేజీతో సంచలనం సృష్టించాడు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఫైనల్

మిగతా 2లో



## బిర్యానీతో న్యూ ఇయర్ దావత్

నిమిషానికి 1,336 ఆర్డర్లతో రికార్డ్

వివరాలు 2లో

## న్యూ ఇయర్ కిక్కు

**వెయ్యి కోట్ల మద్యం హాంఫట్**

- ఖజానాకు కాసులే ... కాసులు
- తెలంగాణలో రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు
- డిసెంబర్ చివరి మూడు రోజుల్లో రూ.1.000 కోట్ల మద్యం విక్రయాలు
- చివరి మూడు రోజుల్లో 8.30 లక్షల కేసుల లిక్కర్, 7.78 లక్షల కేసుల బీర్ల విక్రయాలు
- డిసెంబర్ 30న రూ.520 కోట్ల అమ్మకాలు




**హైదరాబాద్, మహా :** తాగుదాం తాగి ఊగుదాం అన్నట్లుగా మద్యం ప్రియులు ఈ ఏడాది న్యూ ఇయర్‌కు ఘన స్వాగతం పలికారు. మద్యం కిక్కులో ఎవరేం చేస్తున్నారో తెలియని స్థితిలో కొంత తాగి పడిపోగా, మరికొంత తాగి ఎంజాయ్ చేస్తూ న్యూ ఇయర్ వేడుకలను ఆస్వాదిచారు. నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో మద్యం విక్రయాలు భారీగా నమోదయ్యాయి. డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో కలిపి మూడు రోజుల్లోనే సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన మద్యం అమ్ముడైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ మూడు రోజుల్లో 8.30 లక్షల కేసుల లిక్కర్, 7.78 లక్షల కేసుల బీర్ల విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఆరు రోజుల్లో మొత్తం రూ.1,350 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. డిసెంబర్ 30న రికార్డు స్థాయిలో రూ.520 కోట్ల అమ్మకాలు జరగగా, 31న రూ.370 కోట్ల విక్రయాలు నమోదయ్యాయి. తెలంగాణలో డిసెంబర్ మొదటి పదిహేను రోజుల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల కారణంగా కూడా మద్యం విక్రయాలు అధికంగా జరిగాయి.

మిగతా 2లో

## ప్రపంచ స్థాయికి ఎగ్జిబిషన్ సొసైటీ ఎదగాలి

**హైదరాబాద్‌ను అత్యంత సేఫ్ సిటీగా తయారు చేస్తున్నాం**

**ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**




**హైదరాబాద్, మహా:** ప్రపంచీకరణ తర్వాత ప్రపంచం ఓ చిన్న గ్రామంగా మారిన నేపథ్యంలో ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ సొసైటీ ప్రపంచ స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సాయంత్రం నాంపల్లిలో ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. గత పాలకులు ఎగ్జిబిషన్ సొసైటీని ప్రోత్సహిస్తామని అనేక హామీలు ఇచ్చారు కానీ అమలు చేయలేదన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలోని ఈ ప్రభుత్వం సొసైటీ ప్రెసిడెంట్ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సొసైటీని పెద్ద ఎత్తున విస్తరింపజేసి ఆదాయం సృష్టించుకుని, ఎగ్జిబిషన్ సొసైటీ ఆలోచనలను సఫలీకృతం చేయాలన్న పట్టుదలతో ఉన్నారని వివరించారు. నుమాయిష్ హైదరాబాద్

మిగతా 2లో

## న్యూ ఇయర్‌కు గ్రాండ్ వెల్ కం

**హైదరాబాద్‌లో 1198 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు**

**పోలీసులు హెచ్చరించినా బేఖాతర్ చేసిన పౌరులు**

**హైదరాబాద్, మహా :** కొత్త సంవత్సరానికి హైదరాబాద్ గ్రాండ్ గా వెల్‌కమ్ చెప్పింది. న్యూ ఇయర్ అర్ధరాత్రి సంబరాలు అంబరాన్నంటాయి. ఎలాంటి ప్రమాదాలు జరగలేదు. కానీ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు మాత్రం నమోదు అయ్యాయి. తాగి రోడ్ల మీదకు రావొద్దని పోలీసులు ఎంత హెచ్చరించినా.. మందుబాబులు మాత్రం వచ్చేశారు.

మిగతా 2లో



## కేరళ పాలిటిక్స్‌పై ప్రధాని మోదీ కామెంట్స్

### యుడిఎఫ్ ఎల్ డిఎఫ్ ఫిక్స్‌డ్ మ్యాచ్ త్వరలో ముగింపు

**మహా:** కేరళలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ మధ్య ఫిక్స్‌డ్ మ్యాచ్ నడుస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ఆ మ్యాచ్‌కు త్వరలో తెరపడనుందని తెలిపారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాని మోదీ సంచలన కామెంట్స్ చేశారు. ఈ మేరకు తిరువనంతపురం కార్పొరేషన్ మేయర్ వీ.వి. రాజేశ్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లేఖ రాశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఘనవిజయం సాధించిన వేళ, తిరువనంతపురం కార్పొరేషన్ కొత్త మేయర్‌గా ఎన్నికైన రాజేశ్‌కు మోదీ అభినందన లేఖ పంపారు. దాన్ని రాజేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. అందులో మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన జి.ఎస్. ఆశా నాథ్‌ను కూడా ప్రధాని మోదీ అభినందించారు. 2026 సంవత్సర ఆరంభంలో, పండుగ వాతావరణంలో తిరువనంతపురం నగరంలో చరిత్ర సృష్టించారని కొనియారు. రాజేశ్ మేయర్‌గా, ఆశాజీ డిప్యూటీ మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని మోదీ తెలిపారు.

# కేసీఆర్ హరీష్‌ను ఉరితీసినా తప్పులేదు

(మొదటిపేజీ తరువాయి)

ఐదేళ్ల వరకు రూ.20 వేల కోట్ల బిల్లులు చెల్లించే వరకు కనీసం డీపీఆర్ కూడా తయారు చేయలేదని, ఎలాంటి అనుమతులు లేకుండానే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును చేపట్టారని గుర్తు చేశారు. అనంతరం ఆ దోపిడీ బయటకు రాకుండా ఉండేందుకు డీపీఆర్‌ను దాచారని పేర్కొన్నారు. రూ.32 వేల కోట్ల ప్రాజెక్టును రూ.80 వేల కోట్లకు పైగా పెంచారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**బీఆర్ఎస్ మనుగడ ప్రశ్నార్థకమైందనే నీళ్ళ డ్రామా**

ప్రాజెక్టులకు నిధులు, అనుమతుల కోసమే ఢిల్లీకి వెళ్తున్నానని, బలమైన వాదనలు వినిపిస్తూ ముందుకు వెళ్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేసీఆర్‌కు రాజకీయ సమాధి తప్పదనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అబద్ధాల పోటీ పెడితే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఫస్ట్ వస్తారంటూ సెటైర్లు వేశారు. ఇప్పటికైనా కేసీఆర్ సభకు వచ్చి మాట్లాడాలని, ఆయన గౌరవానికి ఎలాంటి భంగం కలగదని తెలిపారు. రూ. వేల కోట్ల కమిషన్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో తేలాలని అన్నారు. జూరాల నుంచి ప్రాజెక్టును మార్చడంతో లోతైన అవినీతి జరిగిందని అన్నారు. అదే జూరాల వద్ద ప్రాజెక్టును కట్టి ఉంటే కావాల్సినన్ని నీళ్లు తీసుకునేవాళ్లమని పేర్కొన్నారు. మన భూభాగంలో



మనం నీళ్లు తీసుకొని ఉంటే చంద్రబాబు, జగన్ ఢిల్లీలో మొత్తుకునే పరిస్థితి ఉండేదన్నారు. శ్రీశైలం నుంచి నీళ్లు తీసుకోవడానికి మన శక్తి సరిపోదన్నారు. పాలమూరుపై వాస్తవాలు చెప్పేసరికి బనకచర్ల పేరుతో టాపిక్ డైవర్ట్ చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ మనుగడ ప్రశ్నార్థకమైందని అన్నారు. అందుకే పార్టీని మళ్లీ బతికించుకునేందుకు కేసీఆర్ నీళ్ల సెంటిమెంట్‌ను వాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు పేరు చెప్పి తెలంగాణలో మళ్లీ పార్టీకి ఊపిరిపోసే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు.

**అసెంబ్లీకి ప్రతి ఒక్కరూ హాజరుకావాలి**

అసెంబ్లీకి ప్రతి కాంగ్రెస్ ఎమ్మెల్యే హాజరుకావాలని, నీళ్ళ చర్చను కింది వరకు తీసుకెళ్ళాలని సీఎం కోరారు. మనం నిజం చెప్పకుంటే కేసీఆర్ హరీష్ అబద్ధాలు చెప్పుకుంటూ పోతారని, సభకు వస్తే ఆధారాలు.. డాక్యుమెంట్లు ముందు పెడతామన్నారు. కేసీఆర్ సభకు రావాలని సీనియర్లు కూడా సూచించాలన్నారు.

# న్యూ ఇయర్ కిక్కు

(మొదటిపేజీ తరువాయి)

డిసెంబర్ నెలలో నూతన సంవత్సర వేడుకలతో పాటు పంచాయతీ ఎన్నికలు కూడా ఉండటంతో 2024 డిసెంబర్‌తో పోలిస్తే మద్యం విక్రయాలు రూ.1,349 కోట్లు అధికంగా జరిగాయి.

**గత రికార్డు బ్రేక్**

కాగా, 2025 డిసెంబర్‌లో చివరి ఐదు రోజుల వ్యవధిలోనే రూ. 1,344 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయని ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఇలా ఒకే నెలలో రూ. 5 వేల కోట్లకు మించి లిక్కర్ సేల్స్ జరగడం ఇదే తొలిసారి అని.. దీన్ని ఆల్‌టైం రికార్డ్‌గా పేర్కొంటున్నారు. 2023 డిసెంబర్‌లో నమోదైన మద్యం అమ్మకాల రికార్డు రూ. 4,300 కోట్లను ఈ డిసెంబర్ బ్రేక్ చేసింది. మద్యానికి డిమాండ్ పెరగడంతో.. సరఫరాలో ఇబ్బందులు లేకుండా ముందుగానే ఎక్సైజ్ శాఖ ప్రణాళికలు వేసింది.

**లిక్కర్ సేల్స్ పెరగడానికి కారణాలివే**

2025 డిసెంబర్‌లో లిక్కర్ సేల్స్ పెరగడానికి పలు కారణాలు ఉన్నాయి. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నిక వేళ మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. దానికి తోడు న్యూఇయర్ వేడుకలు కూడా తోడయ్యాయి. అంతేకాకుండా కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా.. కొత్తగా ఏర్పాటైనా మద్యం షాపుల్లో అనేక రకాల మద్యం బ్రాండ్లు, ఫ్లేవర్లు అందుబాటులో ఉంచారట. దీని వల్ల కూడా న్యూఇయర్ వేడుకల వేళ అమ్మకాలు జోరుగా సాగినట్లు అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం దుకాణాలు, ఒంటి గంట వరకు బార్లు తెరిచి ఉండేందుకు ఎక్సైజ్ శాఖ అనుమతించింది. అమ్మకాలు మరింత పెరగడానికి ఇవి దోహదం చేశాయి. లిక్కర్ సేల్స్ పెరగడంతో కొత్తగా ప్రారంభించిన మద్యం దుకాణాల యజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా దీని వల్ల ఎక్సైజ్ శాఖకు గణనీయమైన ఆదాయం లభించిందని అధికారులు వెల్లడించారు. 2025 డిసెంబర్‌లో మద్యం అమ్మకాలు రికార్డు క్రియేట్ చేయడం ఇది రెండో సారి. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా తెలంగాణలో.. డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు భారీగా మద్యం అమ్మకాలు జరిగాయి. నాలుగు రోజుల్లో దాదాపు రూ. 600 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే లిక్కర్ సేల్స్ 107 శాతం పెరిగాయని చెప్పారు. చలి పులి పంజా విసిరినా.. బీర్ల అమ్మకాలు జోరుగా సాగడం గమనార్హం. అందుకే నాలుగు రోజుల్లోనే 5.89 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయని అధికారులు చెప్పారు.

### కేసీఆర్, హరీష్‌రావు చెప్పేవన్నీ

# అసత్యాలే

### మంత్రి ఉత్తమ్ ఫైర్

**హైదరాబాద్, మహా:** పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు కేసీఆర్ ప్రభుత్వం రూ.27 వేలకోట్లే ఖర్చు చేసిందని, గత ప్రభుత్వంలో 90 శాతం పనులు పూర్తవడం నిజం కాదని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కేసీఆర్, హరీష్‌రావు అన్నీ అసత్యాలు చెబుతున్నారని ఉత్తమ్ పేర్కొన్నారు. రూ.27 వేలకోట్లే ఖర్చు చేసి 90 శాతం పూర్తిచేశారని ఎలా చెబుతారని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కావాలంటే ఇంకా రూ.80 వేలకోట్లు కావాలని, ఇప్పటికి తమ ప్రభుత్వం రూ.7 వేలకోట్లు ఖర్చు పెట్టిందని ఉత్తమ్ తెలిపారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని అన్నారు. ప్రాజెక్టు పనులు తామే పూర్తి చేసినట్టు బీఆర్ఎస్ నేతలు అసత్యాలు చెబుతున్నారని అన్నారు.

# బిర్యానీతో న్యూ ఇయర్ దావత్

### నిమిషానికి 1,336 ఆర్డర్లతో రికార్డ్

**మహా:** 2026 నూతన సంవత్సర వేడుకలను భారతీయులు తమదైన రీతిలో జరుపుకున్నారు. తమకు ఇష్టమైన ఆహార పదార్థాలు ఆన్‌లైన్‌లో తెప్పించుకుని, న్యూ ఇయర్ వేడుకలను ఆస్వాదించారు. ముఖ్యంగా బుధవారం ఒక్కరోజే ఆన్‌లైన్‌లో నిమిషానికి 1,336 బిర్యానీలు ఆర్డర్ చేసి రికార్డ్ సృష్టించారు. ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాం స్విగ్గీ వెల్లడించిన వివరాల ప్రకారం, న్యూ ఇయర్ ఈవ్‌లో బిర్యానీ ఆర్డర్లు వెల్లువలా వచ్చిపడ్డాయి. డిసెంబర్ 31 రాత్రి 8 గంటలకే స్విగ్గీలో నిమిషానికి సగటున 1,336 బిర్యానీ ఆర్డర్లు వచ్చాయి. , రాత్రి 7.30 గంటలకే ఏకంగా 2,18,993 బిర్యానీలు ఆర్డర్స్ వచ్చాయి. భారతీయులు 2025 మొత్తంలో ఏకంగా 93 మిలియన్ బిర్యానీలు ఆర్డర్ చేశారు. అంటే సగటున ప్రతి సెకెన్‌కు 3.25 ఆర్డర్లు వచ్చాయన్నమాట. దీనిని బట్టి భారతీయులకు బిర్యానీ అంటే ఎంత ఇష్టమో చెప్పేయొచ్చు.

**పిజ్జా, బర్గర్స్ కూడా ఫుల్ డిమాండ్**

న్యూఇయర్ వేడుకల్లో బిర్యానీకి పిజ్జా, బర్గర్‌లు కూడా గట్టిపోటీ ఇచ్చాయి. ఇది మారుతున్న యువత ఆహారపు అలవాట్లను ప్రతిబింబిస్తోంది. స్విగ్గీ డేటా ప్రకారం, రాత్రి 8.30 గంటల నాటికి 2.10 లక్షలకు పైగా పిజ్జాలు డెలివరీ జరిగాయి. మరోవైపు 2.16 లక్షలకు పైగా బర్గర్లు ఆర్డర్లు పెట్టారు. న్యూఇయర్ వేడుకల వేళ ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్స్ జొమాటో, క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్‌లు సరికొత్త రికార్డు నెలకొల్పాయి. ఎటెర్నల్‌కు చెందిన ఈ రెండు సంస్థలు డిసెంబర్ 31న ఒక్కరోజే ఈ రెండికి కలిపి ఏకంగా 75 లక్షల ఆర్డర్లు వచ్చాయి. ఈ విషయాన్ని కంపెనీ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ తన ఎక్స్ పోస్ట్ ద్వారా తెలిపారు.

## ప్రపంచ స్థాయికి ఎగ్జిబిషన్ సొసైటీ ఎదగాలి



(మొదటిపేజీ తరువాయి)

నగరానికే కాదు తెలంగాణ రాష్ట్రానికి ఒక పెద్ద ఉత్సవం అని అన్నారు. సమాజానికి మేలు చేయాలన్న ఆలోచనతో ఉస్మానియా పట్టభద్రులు పబ్లిక్ గార్డెన్స్ లో మొదట 1938లో ఎగ్జిబిషన్స్ సొసైటీని ప్రారంభించారని వివరించారు. ఎగ్జిబిషన్ సొసైటీకి చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, కాటేజ్, చేతివృత్తుల ఉత్పత్తిదారులు దేశం నలుమూలల నుంచి వచ్చి అమ్మకానికి పెట్టేవారు ఇది ఒక వ్యవస్థగా మొదలైందని తెలిపారు. ఇది కేవలం వ్యాపారం కాదు అనేక సంస్కృతుల మేలు కలయిక విభిన్న చేతివృత్తుదారులు వారి ఉత్పత్తులు కలా నైపుణ్యం ప్రదర్శనకు ఒక పెద్ద కేంద్రంగా మారడంతో క్రమక్రమంగా ఎగ్జిబిషన్ సొసైటీ పబ్లిక్ గార్డెన్స్ నుంచి 1936లో ప్రస్తుతం నాంపల్లిలో ఉన్న ప్రాంతానికి మారిందన్నారు. కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు ఉత్పత్తిదారులు ఈ ఎగ్జిబిషన్ సొసైటీ కి వస్తారు రాజగోపాల చారి 1949 జనవరి మొదటి తేదీన స్వాతంత్రం అనంతరం ప్రారంభించారని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని విద్యార్థుల చదువు, చేతివృత్తుల వారికి సహాయం అందించడం ప్రధానంగా మహిళా సాధికారతను దృష్టిలో పెట్టుకుని కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలు స్థాపించడం వంటి గొప్ప పనులు ఈ సొసైటీ చేయడం అభినందనీయం అన్నారు. లాభాపేక్ష లేకుండా పూర్తి నాణ్యతతో 19 విద్యాసంస్థలను సొసైటీ నిర్వహించడం గొప్ప విషయం అన్నారు.

హైదరాబాద్ వాసుల ప్రేమ, ఆప్యాయత, వాతావరణం, శాంతి భద్రతలు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు హైదరాబాద్ నగరంలో స్థిరపడడానికి ఆసక్తి చెబుతున్నారని ఇక్కడ ఉన్న విద్య, వ్యాపారం కోసం వచ్చిన వారు ఇక్కడే స్థిరపడుతున్నారని హైదరాబాద్ నగరం పెద్ద ఎత్తున విస్తరిస్తుందని డిప్యూటీ సీఎం వివరించారు. అన్ని వర్గాలు, మతాలు, ప్రాంతాల వారు వారికి కావలసిన విధంగా హైదరాబాదులో బతికే ఏర్పాటు చేసుకునే సౌకర్యం ఉందని డిప్యూటీ సీఎం అన్నారు. గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్ను అత్యంత సేఫ్ నగరంగా రూపొందించాలని ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. కాలుష్యరహితంగా, 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తు సరఫరా, పూర్తి శాంతి భద్రతలతో కూడిన నగరంగా హైదరాబాదును రూపొందించే ఆలోచనలో ప్రజా ప్రభుత్వం ఉందని తెలిపారు అందులో సొసైటీ సభ్యులు భాగం కావాలని విజ్ఞప్తి చేశారు.

లండన్ లోని థీమ్స్ ఉన్నది అభివృద్ధి ద్వారా పరిసర ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందాయో అదేవిధంగా మూసి నదిలో మంచినీరు ప్రవహింపచేసి పునర్జీవనం కోసం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని, మూసి పరిసర ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని అన్నారు.

వాతావరణ కాలుష్యం మూలంగా ఢిల్లీ నగరంలో వారం రోజులు ఉండే పరిస్థితి లేదు ఆ పరిస్థితి హైదరాబాద్ మహానగరంలో తలెత్తకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. రాక్స్, లేక్స్ , పార్కులతో కూడిన నగరం హైదరాబాద్ ఇవి భవిష్యత్తు తరాలకు భద్రంగా అందించాలని ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. నగరంలోని డీజిల్ బస్సులను దశలవారీగా బయటకు పంపి బ్యాటరీ బస్సులను ప్రవేశపెడుతున్నామని, ప్లాస్టిక్ రహిత నగరంగా హైదరాబాదును మార్చుతామని ఇటీవల సీఎం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. నగరం లోపల ఉన్న కాలుష్య కారకమైన ఇండస్ట్రియల్ పార్కులను అవుటర్ రింగ్ రోడ్డు బయటకు తరలించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు.

## రూ..2.5 కోట్ల ప్యాకేజితో చరిత్ర సృష్టించిన ఐఐటీ హైదరాబాద్ విద్యార్థి

### మరో కంప్యూటర్ విద్యార్థి రూ. 1.1 కోట్ల ప్యాకేజీ

(మొదటిపేజీ తరువాయి)

ఇయర్ చదువుతున్న ఎడ్వర్డ్ నాథన్ వర్గీస్‌కు నెదర్లాండ్స్‌కు చెందిన గ్లోబల్ ట్రేడింగ్ సంస్థ ఆప్టివర్ ఏకంగా రూ. 2.5 కోట్ల వార్షిక వేతనాన్ని ఆఫర్ చేసింది. 2008లో ఐఐటీ హైదరాబాద్ ఏర్పాటైన నాటి నుంచి ఇదే అత్యధిక ప్యాకేజీ కావడం విశేషం. ఈ ఆఫర్ రెండు నెలల సమ్మర్ ఇంటర్న్‌షిప్ ద్వారా ప్రీప్లేస్‌మెంట్ ఆఫర్ (పీపీఓ)గా వచ్చింది. ఈ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన ఇద్దరిలో వర్గీస్ ఒక్కరే పీపీఓ అందుకోవడం గమనార్హం. 21 ఏళ్ల వర్గీస్ జులై నుంచి ఆప్టివర్ నెదర్లాండ్స్ కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పూర్తిస్థాయిలో విధుల్లో చేరనున్నాడు. హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగిన వర్గీస్, తన తల్లిదండ్రులిద్దరూ ఇంజినీర్లేనని తెలిపారు. ఈ విజయంపై వర్గీస్ మాట్లాడుతూ, "ఇదే నా మొదటి, ఏకైక ఇంటర్వ్యూ. పీపీఓ వస్తుందని నా మెంటార్ చెప్పినప్పుడు చాలా సంతోషంగా అనిపించింది. ఫస్ట్ ఇయర్ నుంచి కాంపిటేటివ్ ప్రోగ్రామింగ్‌లో దేశంలోని టాప్ 100లో ఉండటం ఇంటర్వ్యూలో నెగ్గడానికి బాగా ఉపయోగపడింది. ఐఐటీ ట్యాగ్ కూడా కలిసొచ్చింది" అని వివరించారు. ఈ ప్లేస్‌మెంట్ సీజన్‌లో మరో కంప్యూటర్ సైన్స్ విద్యార్థి రూ. 1.1 కోట్ల ప్యాకేజీని అందుకోవడం విశేషం. ఈ ఏడాది సంస్థ సగటు ప్యాకేజీ గత ఏడాదితో పోలిస్తే 75 శాతం పెరిగి రూ. 20.8 లక్షల నుంచి రూ. 36.2 లక్షలకు చేరింది. డిసెంబరులో ముగిసిన మొదటి దశ ప్లేస్‌మెంట్లలో 487 మంది యూజీ విద్యార్థులకు గాను 62 శాతం మంది ఉద్యోగాలు పొందారు. అధిక ప్యాకేజీల కంటే, ప్లేస్‌మెంట్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులందరికీ మంచి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని కెరీర్ సర్వీసెస్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి మయూర్ వైద్య తెలిపారు. టెక్ ఉద్యోగాలతో పాటు కోర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు కూడా మంచి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించామని ఆయన చెప్పారు. త్వరలో ప్రారంభం కానున్న ఫేజ్ 2 ప్లేస్‌మెంట్లలో మరిన్ని దేశీయ కంపెనీలు పాల్గొంటాయని ఐఐటీహెచ్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# బంగ్లాలో హిందువులపై ఆగని దాడులు

**మహా :** బంగ్లాదేశ్ లో విద్యార్థి నాయకుడి హత్య తర్వాత హిందువులపై మొదలైన దాడులు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థి నేత ఉస్మాన్ హాదీ హత్య తర్వాత అక్కడి తాత్కాలిక ప్రభుత్వాన్ని కూడా లెక్కచేయకుండా అల్లరిమూకలు రెచ్చిపోతున్నాయి. ఈ నేపథ్యంలో హిందువులపై మొదలైన దాడులకు కొనసాగింపుగా తాజాగా ఖోంకన్ దాస్ అనే మరో హిందువుపై దాడి చేసి నిప్పంటించారు. షరియత్‌పూర్ జిల్లాలో మెడికల్ షాప్ నిర్వహిస్తున్న 50 ఏళ్ల ఖోంకన్ దాస్ ఇంటికి వెళ్తుండగా.. ఓ గుంపు అతన్ని అడ్డగించింది. అతని కడుపు దిగువ భాగంలో పొడిచి, కొట్టి, పెట్రోల్ పోసి నిప్పంటించింది. అయితే అతను సమీపంలోని చెరువులోకి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. దాస్ తన మెడికల్ షాపు మూసివేసి ఇంటికి తిరిగి వస్తుండగా దాడి జరిగిందని అతని భార్య తెలిపింది. ఇది ఎవరు చేశారో తనకు తెలియదని, కానీ తమకు న్యాయం కావాలని ఆమె వేడుకుంది. తన భర్త ఒక సాధారణ వ్యక్తి అని, అతను ఎవరికీ హాని చేయలేదని, ఎవరినీ బాధపెట్టలేదని తెలిపింది. రెండు వారాల్లో బంగ్లాదేశ్‌లో హిందువుపై జరిగిన నాల్గవ దాడి ఇది. డిసెంబర్ 18న మైమెన్సింగ్‌లోని భలుకా ఉపజిల్లాలోని తన ఫ్యాక్టరీలో ఒక ముస్లిం సహోద్యోగిపై తప్పుడు దైవదూషణ ఆరోపణలపై 25 ఏళ్ల హిందూ యువకుడు దీపు చంద్ర దాస్‌ను మూక దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఆ గుంపు దాస్‌ను హత్య చేసి, ఆపై అతని మృతదేహాన్ని చెట్టుకు వేలాడదీసి నిప్పంటించింది. తర్వాత డిసెంబర్ 24న బంగ్లాదేశ్‌లోని కలిమోహర్ యూనియన్‌లోని హోస్సైన్‌డంగా ప్రాంతంలో 29 ఏళ్ల అమృత్ మండల్ అనే మరో హిందూ యువకుడిని ఒక గుంపు కొట్టి చంపిందని ఆరోపణలు ఉన్నాయి. బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న మూకదాడులు, హత్యలపై భారత్ ఇప్పటికే ఆగ్రహం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్ మాత్రం భారత్ ఆందోళనలను పట్టించుకోకపోవడంతో పరిస్థితులు మరింత దిగజారుతున్నట్లు తెలుస్తోంది.

### కేసీఆర్ ను ఉరితీయాలంటూనే

# మర్యాద పాటిస్తానంటావా?

- సీఎం నోటినుండి టన్నుల కొద్దీ అబద్ధాలు
- సీఎం కామెంట్స్ పై మాజీ మంత్రి హరీష్ రావు రియాక్షన్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ) మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తన నోటి నుంచి టీఎంసీల కొద్దీ అబద్ధాలు, క్యూసెక్కుల కొద్దీ అజ్ఞానాన్ని పారించారని విమర్శలు చేశారు. అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అనుముల రేవంత్‌రెడ్డేనని అన్నారు. నటనకు ఇచ్చినట్లు అబద్ధాలకు కూడా ఆస్కార్ గనుక ఇస్తే అంతర్జాతీయంగా అందరూ ముక్తకంఠంతో రేవంత్‌రెడ్డినే ఎంపిక చేస్తారని సెటైర్లు గుప్పించారు. ఈ గురువారం హరీశ్‌రావు ప్రకటన విడుదల చేశారు. సెంబ్లీకి వస్తే కేసీఆర్‌ను అవమానించమని ఒకవైపు చెబుతూనే అదే ప్రెస్‌మీట్‌లో అర్థం లేకుండా మాట్లాడుతావా. తెలంగాణ పోరాటాన్ని ఉరకలెత్తించి, నాలుగు కోట్ల ప్రజలను ఒక్కటి చేసి ప్రాణాలకు తెగించి నిరాహారదీక్ష చేసి.. కాంగ్రెస్ మెడలు వంచి కేసీఆర్ తెలంగాణను సాధించారు. కేసీఆర్‌ని, నన్ను ఉరి తీయాలని, రాళ్లతో కొట్టాలని అంటూ అనాగరిక వ్యాఖ్యానాలు చేస్తూ.. మరోవైపు మర్యాద పాటిస్తానని సుద్దపూసలా నటిస్తావా? అంటూ హరీష్ రావు ఫైరయ్యారు.

# జర్మనీలో తెలుగు విద్యార్థి మృతి

### అపార్ట్ మెంట్‌లో అగ్నిప్రమాదం కారణంగా పై నుంచి దూకిన యువకుడు

**మహా :** జర్మనీలో జరిగిన ఒక అపార్ట్‌మెంట్ అగ్ని ప్రమాదంలో తెలంగాణకు చెందిన విద్యార్థి మరణించాడు. మృతుడిని జనగాం జిల్లా చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన తోకల హృతిన్ రెడ్డిగా గుర్తించారు. హృతిన్ రెడ్డి ఉన్నత విద్యను అభ్యసించడానికి జర్మనీకి వెళ్లాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం, అతను నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో మంటలు చెలరేగాయి. మంటల నుండి తప్పించుకునే ప్రయత్నంలో, హృతిన్ భవనంపై నుండి దూకడంతో తలకు తీవ్ర గాయమైనట్లు సమాచారం. ఆసుపత్రికి తరలించి చికిత్స చేసినప్పటికీ, పరిస్థితి మరింత దిగజారి గాయాలతో హృతిన్ రెడ్డి మరణించాడు. అగ్నిప్రమాదానికి గల కారణాలు, సంఘటన కచ్చితమైన పరిస్థితులకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# న్యూ ఇయర్‌కు గ్రాండ్ వెల్ కం

(మొదటిపేజీ తరువాయి)

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో అడ్డంగా బుక్కయ్యారు. రికార్డు స్థాయిలో కేసులు నమోదు అయ్యాయి. ఒక్క హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే 1198 కేసులు నమోదైనట్టుగా పోలీసులు వెల్లడించారు. గత రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక తనిఖీల్లో కేసులు నమోదు చేశారు. పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

**ఇదీ హైదరాబాద్ అంటే..**

**న్యూ ఇయర్ నైట్‌పై సజ్జనార్ కామెంట్స్**

హైదరాబాద్ ప్రజలపై సీపీ సజ్జనార్ ప్రశంసలు కురిపించారు. నూతన సంవత్సరం వేళ ప్రజలు ఎంతో బాధ్యతయుతంగా ప్రవర్తించారని చెప్పారు. న్యూ ఇయర్ 2026కు అంతా స్వాగతం పలికారు. అయితే ఈసారి హైదరాబాద్ పోలీసులు ఎటువంటి ఘటనలు జరగకుండా.. ముందస్తుగానే కఠిన ఆంక్షలు విధించారు. ఎలాంటి ప్రమదాలు జరగకూడదని ముందస్తుగా హెచ్చరికలు జారీ చేశారు. పబ్బులు, క్లబ్బుల దగ్గర నుంచి తాగి వాహనాలు నడపొద్దని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. జరిమానాలు భారీగా ఉంటాయని చెప్పారు. దీంతో జనాలు కూడా జాగ్రత్తగా న్యూఇయర్ సెలబ్రేషన్స్ చేసుకున్నారు. హైదరాబాద్‌లో న్యూఇయర్ వేడుకల సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగలేదు. నగరంలో ఎటువంటి సంఘటనలు లేకుండా నూతన సంవత్సర వేడుకలు జరిగాయని, పెద్ద ప్రమాదాలు ఏవీ జరగలేదని హైదరాబాద్ సీపీ సజ్జనార్ చెప్పారు. పోలీసుల కఠినమైన ఆంక్షలు, నగరం అంతటా అవగాహన ప్రచారాలతో సురక్షితంగా న్యూ ఇయర్ జరుపుకొన్నారని సజ్జనార్ చెప్పారు. రోడ్డు భద్రతను నిర్ధారించడంలో పోలీసులు, పౌరుల సమిష్టి కృషిని సీపీ సజ్జనార్ ప్రశంసించారు. మద్యం తాగి వాహనాలు నడపడంపై చర్యలు, ప్రభావవంతమైన అవగాహన కార్యక్రమాలు ప్రమాదాలను నివారించడంలో కీలక పాత్ర పోషించాయని అన్నారు. 'ఇది యాదృచ్ఛికంగా జరగలేదు. అవగాహన పనిచేసింది, బాధ్యత గెలిచింది, ప్రజా సహకారం గొప్పది. హైదరాబాద్‌ను సురక్షితమైన ప్రపంచ నగరంగా మార్చడానికి పౌరులు కలిసి పనిచేయాలి.' అని హైదరాబాద్ సీపీ సజ్జనార్ చెప్పారు. రోడ్డు భద్రత సందేశాన్ని సజ్జనార్ బలంగా చెప్పారు. వేడుకలకు ఎప్పుడూ ప్రాణాలను పణంగా పెట్టకూడదని, మద్యం మరియు డ్రైవింగ్ ఎప్పుడూ కలిసి ఉండకూడదని గుర్తు చేశారు. ప్రమాదాలు లేని వేడుకలు సాధ్యమేనని నగరం చూపించిందన్నారు. హైదరాబాద్‌ను మరింత సురక్షితమైన, గ్లోబల్ సిటీగా మార్చేందుకు కలిసి ముందుకు సాగుదాం.. హైదరాబాద్ నేర్పింది ఒక్కటే.. రిస్క్ లేకుండా సెలబ్రేషన్ ఉండొచ్చు అని సజ్జనార్ అన్నారు.

# బహుజనుల చైతన్యంతోనే రాజ్యాధికారం

### మేమెంతో మాకంత వాటా దక్కేంతవరకు పోరాటం చేస్తాం

### టిఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్

**సూర్యాపేట జిల్లా మహా:** బహుజనుల చైతన్యంతోనేరాజ్యాధికారం సిద్ధిస్తుందని,మేమెంతో మాకంత వాటా దక్కేంతవరకు పోరాటం చేస్తామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలో టిఆర్పీ పార్టీ కార్యాలయం లో నూతన సంవత్సర సందర్భంగా గురువారం జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు ఎస్సీ, ఎస్టీ ,బి సి, మైనార్టీ వర్గాల అందరికీ ఈ ఏడాది అంతా శుభాలు కలగాలని, ఏడు దశాబ్దాలకు పైగా సింహభాగం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాల ప్రజలను అగ్రకులాలు పావులుగా వాడుకోవడం వలన బహుజనులు అధికారానికి దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. మెజార్టీ ప్రజలకు రాజ్యాధికారంలో వాటా దక్కాలని బీసీల పక్షపాతి టిఆర్పీ రాష్ట్రఅధ్యక్షులు తీన్మార్ మల్లన్న నాయకత్వం లో పార్టీ ఏర్పాటు చేసి 100 రోజులుపూర్తయిందని ఎన్నో గొప్ప విజయాలు సాధించామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ప్రతి ఏడాది 20 కోట్ల రూపాయలు బడ్జెట్ ప్రవేశపెడతామని ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని తెలిపారు. బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కృతనిశ్చయంతో తీన్మార్ మల్లన్న పని చేస్తున్నాడని అన్నారు.ఉమ్మడి



నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసి గెలుపొందేలా టీఆర్పీ వ్యూహ రచన చేస్తుందని చెప్పారు. రాబోయే రోజుల్లో బహుజ న కులాల కు ఫలాలు దక్కేలా రాజ్యాధికారం దిశగా అగ్రకులాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిఆర్పీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ గౌడ్, జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, పెన్ పహాడ్ మండల అధ్యక్షులు ఆవుల అంజయ్య యాదవ్,కోల కరుణాకర్, లింగాల సైదులు, జానకి రాములు, మల్లేష్, వర్రె కవిత,మీర్ పర్వీన్,బాల్మీకి దీపమాల, సంజన,బొమ్మగాని సైదులు, కుంభం వెంకన్న యాదవ్, వల్లాల వెంకట్ యాదవ్, బోడపట్ల మధు గౌడ్, చింతకాయల జానయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, కలగాని వెంకన్న ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

# డిసెంబరులో రూ.1.74 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు

- 2024 డిసెంబరుతో పోలిస్తే 6.1 శాతం వృద్ధి నమోదు
- పన్ను రేట్ల తగ్గింపు ఉన్నప్పటికీ పెరిగిన వసూళ్లు
- ఫిబ్రవరి 1 నుంచి పొగాకు ఉత్పత్తులపై కొత్త పన్నుల విధానం

**న్యూఢిల్లీ, మహా :** దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిని సూచిస్తూ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి ఆశాజనకమైన వృద్ధిని నమోదు చేశాయి. 2025 డిసెంబరు నెలలో జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి రూ.1,74,550 కోట్ల ఆదాయం సమకూరినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. 2024 డిసెంబరులో నమోదైన రూ.1,64,556 కోట్లతో పోలిస్తే ఇది 6.1 శాతం అధికం కావడం గమనార్హం. పండుగల సీజన్ తర్వాత కూడా దేశంలో ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగుతున్నాయనడానికి ఈ గణాంకాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. డిసెంబర్ నెల వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ వాటా రూ.34,289 కోట్లు కాగా, స్టేట్ జీఎస్టీ వాటా రూ.41,368 కోట్లుగా ఉంది. ఇక ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ ద్వారా అత్యధికంగా రూ.98,894 కోట్లు వసూలయ్యాయి. రుణ బకాయిల చెల్లింపుల కోసం తాత్కాలికంగా కొనసాగిస్తున్న జీఎస్టీ పరిహార సెస్ రూపంలో ప్రభుత్వానికి మరో రూ.4,551 కోట్లు అందాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఈ సెస్ ద్వారా మొత్తం రూ.88,385 కోట్లు వసూలయ్యాయి. మరోవైపు, డిసెంబరులో జీఎస్టీ రిఫండుల రూపంలో రూ.28,980 కోట్లను ప్రభుత్వం వెనక్కి చెల్లించింది. కొన్ని విలాసవంతమైన వస్తువులపై 40 శాతం వంటి కొత్త పన్నుల శ్లాబులు ప్రవేశపెట్టినప్పటికీ, పొగాకు, పాన్ మసాలా వంటి వాటిపై సెస్ కొనసాగుతోంది. సెప్టెంబర్ 22 నుంచి కొన్ని వస్తువులపై పన్ను రేట్లు తగ్గించినప్పటికీ, వినియోగదారుల నుంచి డిమాండ్ పెరగడం వల్ల వసూళ్లు పెరగడం విశేషం.

**పొగాకు ఉత్పత్తులపై కొత్త పన్నుల విధానం**

ఇదే సమయంలో, పొగాకు ఉత్పత్తులపై కొత్త పన్నుల విధానాన్ని అమలు చేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం పలు నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు 2026 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇటీవలి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందిన సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) చట్టం2025 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఈ చట్టం పొగాకు ఉత్పత్తులపై కొత్త ఎక్సైజ్ సుంకం రేట్లను నిర్దేశిస్తుంది. దీనితో పాటు, పాన్ మసాలా తయారీపై సెస్ విధించే హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ యాక్ట్, 2025 కూడా అదే తేదీ నుంచి అమల్లోకి రానుంది.

# రోడ్డు ప్రమాదాలను నివారించి మరణాలను తగ్గించాలి

## జీరో ప్రమాదాలే లక్ష్యంగా ఆర్టీసీ పని చేయాలి

## జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్,మహా:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించి మరణాల రేటు తగ్గించడమే లక్ష్యంగా జనవరి 1 నుండి 31 వరకు జరిగే రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 26 వేల రోడ్డు ప్రమాదాలు ,8 వేల మరణాలు సంభవిస్తుండగా ప్రతి రోజు 22 మంది ప్రాణాలు కోల్పోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభ కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా అధికారుల తలకు హెల్మెట్ తొడిగారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు పోస్టర్ ను, వాహనాల స్టికర్ ను , విద్యార్థులకు రోడ్ సేఫ్టీ అవగాహన బుక్స్ రిలీజ్ చేశారు. రోడ్ సేఫ్టీ అవేర్నెస్ పై ఆటో లకు పోస్టర్ అతికించారు. విద్యార్థుల తో రోడ్ సేఫ్టీ పై ఫ్లకార్డులు పట్టుకొని అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతి వేగం ,డ్రంక్ అండ్ డ్రైవ్,రాంగ్ రూట్ లో రావడం , మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని రవాణా శాఖ అధికారులు ప్రతి పాఠశాల వెళ్ళి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నుండి ఒక్క ప్రాణాన్ని కాపాడిన జీవితం సార్థకమవుతుందన్నారు. ఈ సంవత్సరం సడక్ సురక్ష జీవన్ సురక్షా నినాదంతో కార్యక్రమాన్ని 4 ఈ ద్వారా ముందుకు తీసుకుపోతున్నామని వెల్లడించారు. ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్ఫోర్స్మెంట్ , ఎమర్జెన్సీ పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్స్ స్పాట్స్ తొలగించి ప్రమాదాలను నివారించాలని అధికారులకు తెలిపారు. ఇది కేవలం రవాణా శాఖ,ఆర్టీసీ మాత్రమే కాకుండా ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారులు, ఆర్ అండ్ బి,విద్యా శాఖ ఇతర విభాగాల అధికారులు సమన్వయం చేసుకొని నెల రోజుల కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.రవాణా శాఖ అధికారులు ప్రతి పాఠశాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో రోడ్డు నిబంధనలు పాటిస్తామని హామీ పత్రం తీసుకోవాలనీ ఆదేశించారు. రాష్ట్రంలో వెయ్యి మంది రవాణా శాఖ అధికారులు ఉంటే కోటి 80 లక్షల వాహనాలు ఉన్నాయని ప్రతి ఒక్కరు స్వీయ నిర్వహణ పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించని వాహనాలపై లైసెన్స్ సస్పెండ్ చేస్తున్నామని తెలిపారు. రవాణా శాఖ అధికారులు ట్రాఫిక్ చిల్డ్రన్ అవేర్నెస్ పార్క్ ఏర్పాటు పై నిర్లక్ష్యాన్ని వీడాలని హెచ్చరించారు.
ఆర్టీసీ కళా భవన్ లో రోడ్ సేఫ్టీ మంత్ కార్యక్రమాన్ని ప్రారంభించి గత 30 సంవత్సరాలుగా డ్రైవింగ్ చేస్తున్న ఒక్క ప్రమాదం కూడా జరగని డ్రైవర్లను అభినందించి సత్కరించారు. ఆర్టీసీ లో 20 వేల మంది డ్రైవర్లు ,10 వేల బస్సులు ప్రతి రోజు 60 లక్షల మంది ప్రయాణికులు ,39 లక్షల కిలోమీటర్లు లైఫ్ లైన్ అని కొనియాడారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ 2026 లో పాత బకాయిలు పోయి మరింత లాభాల్లోకి వచ్చేలా అందరం కృషి చేద్దామని వెల్లడించారు.ఆర్టీసీ ప్రమాదాలను జీరో కి తగ్గించడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ మాట్లాడుతూ వాహనాల ఫిట్నెస్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కమర్షియల్ వాహనాలను కట్టడి చేయాలని సూచించారు. హెవీ డ్రైవర్లకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వాలని , వైద్య పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రమాదాలను నివారించడానికి ఒక సంవత్సర కాలంలో 100 బ్లాక్ స్పాట్ గుర్తించి తొలగించారని అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొనాలని సూచించారు.. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ లో ప్రతి లక్ష కిలోమీటర్లకు 0.07 శాతం ప్రమాదాలు ఉన్నాయని, సంవత్సర కాలంలో 600 ప్రమాదాలు జరిగాయని తెలిపారు.ప్రమాదాలు తగ్గించడానికి ప్రతి డిపో లో డ్రైవర్లకు శిక్షణ ఇవ్వడం , బ్రీత్ అనలైజర్ టెస్టులు చేయడం, సిబ్బందికి వైద్య పరీక్షలు , బస్సుల ఫిట్నెస్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలు శాశ్వత వికలాంగులు అయిన వారి కుటుంబాలు జీవితాంతం ఇబ్బందులు పడుతున్నాయన్నారు.ఆర్టీసీ ప్రతి సంవత్సరం 80 కోట్లు ప్రమాద బీమా చెల్లించడం జరుగుతుందనీ వెల్లడించారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి,ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జెటిసి లు చంద్రశేఖర్ గౌడ్, రమేష్ , శివలింగయ్య, డీటీసీ లు , స్టేట్ ఆర్టీఏ మెంబర్ నవీన్ ,జిల్లా ఆర్టీఏ సురేష్ లాల్ పాల్గొన్నారు

# నంద్యాల జిల్లాలో దారుణం

## ముగ్గురు పిల్లలకు విషమిచ్చిన తండ్రి- ఆపై సూసైడ్

**నంద్యాల, మహా :** ఓ తండ్రి తన ముగ్గురు మైనర్ కుమారులను హత్య చేసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దారుణమైన ఘటన నంద్యాల జిల్లాలోని ఉయ్యాలవాడ మండలంలో వెలుగు చూసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం తుడుములదిన్నె గ్రామానికి చెందిన వేములపాటి సురేంద్ర (35) ఈ దారుణానికి ఒడిగట్టాడు. తన ముగ్గురు పిల్లలైన కావ్యశ్రీ (7), జ్ఞానేశ్వరి (4), సూర్యగగన్ (2)లకు విషం కలిపిన కూల్ డ్రింక్‌ను తాగించాడు. దీంతో ఈ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఆపై తండ్రి సురేంద్ర కూడా ఉరి వేసుకొని చనిపోయాడు. గతేడాది ఆగస్టులో సురేంద్ర భార్య... మహేశ్వరి అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాత నుంచి సురేంద్ర మానసికంగా ఇబ్బందిపడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఈ దారుణానికి ఒడిగట్టాడా అనేది తేలాల్సి ఉంది. ఈ ఘటనకు గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉందని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ కుమార్ తెలిపారు. విచారణ తర్వాత మరిన్ని వివరాలు బయటికొస్తాయని పేర్కొన్నారు. సురేంద్ర కుటుంబం ఆర్థికంగా పలు రకాల ఇబ్బందులను ఎదుర్కొంటోందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిసింది. దీనికితోడు భార్య ఆగస్టులో ఉరి వేసుకొని చనిపోవటంతో మరింత మానసిక కుంగుబాటుకు సురేంద్ర లోనైట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు సమాచారం. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉంది.

## నూతన సంవత్సర
# శుభాకాంక్షలు

**తుమ్మల వెంకట్ రెడ్డి,**
**బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు**

**వలిగొండ, మహా :** నూతన సంవత్సరం సందర్భంగా వలిగొండ మండల ప్రజలకు ప్రజా ప్రతినిధులకు బి ఆర్ ఎస్పార్టీ నాయకులకు మిత్రులకు శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి గురువారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో శాంతి సౌభాగ్యం సంతోషం ఆరోగ్యం అభివృద్ధితో నిండి ఉండాలని ప్రజల జీవితాలతో ఆనందం పెరగాలని రైతులకు మంచి పంటలు యువతకు ఉపాధి అవకాశాలు విద్యార్థులు విజయాలు మహిళలకు భద్రత వృద్ధులకు ఆదరణ లభించాలని కోరారు వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆయన దిమా వ్యక్తం చేశారు

# రోడ్డు ప్రమాదాలను నివారించి మరణాలను తగ్గించాలి

## జీరో ప్రమాదాలే లక్ష్యంగా ఆర్టీసీ పని చేయాలి

## జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను ప్రారంభించిన మంత్రి పొన్నం





**హైదరాబాద్,మహా:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించి మరణాల రేటు తగ్గించడమే లక్ష్యంగా జనవరి 1 నుండి 31 వరకు జరిగే రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 26 వేల రోడ్డు ప్రమాదాలు ,8 వేల మరణాలు సంభవిస్తుండగా ప్రతి రోజు 22 మంది ప్రాణాలు కోల్పోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభ కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా అధికారుల తలకు హెల్మెట్ తొడిగారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు పోస్టర్ ను, వాహనాల స్టికర్ ను , విద్యార్థులకు రోడ్ సేఫ్టీ అవగాహన బుక్స్ రిలీజ్ చేశారు. రోడ్ సేఫ్టీ అవేర్నెస్ పై ఆటో లకు పోస్టర్ అతికించారు. విద్యార్థుల తో రోడ్ సేఫ్టీ పై ఫ్లకార్డులు పట్టుకొని అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతి వేగం ,డ్రంక్ అండ్ డ్రైవ్,రాంగ్ రూట్ లో రావడం , మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని రవాణా శాఖ అధికారులు ప్రతి పాఠశాల వెళ్ళి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నుండి ఒక్క ప్రాణాన్ని కాపాడిన జీవితం సార్థకమవుతుందన్నారు. ఈ సంవత్సరం సడక్ సురక్ష జీవన్ సురక్షా నినాదంతో కార్యక్రమాన్ని 4 ఈ ద్వారా ముందుకు తీసుకుపోతున్నామని వెల్లడించారు. ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్ఫోర్స్మెంట్ , ఎమర్జెన్సీ పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్స్ స్పాట్స్ తొలగించి ప్రమాదాలను నివారించాలని అధికారులకు తెలిపారు. ఇది కేవలం రవాణా శాఖ,ఆర్టీసీ మాత్రమే కాకుండా ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారులు, ఆర్ అండ్ బి,విద్యా శాఖ ఇతర విభాగాల అధికారులు సమన్వయం చేసుకొని నెల రోజుల కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.రవాణా శాఖ అధికారులు ప్రతి పాఠశాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో రోడ్డు నిబంధనలు పాటిస్తామని హామీ పత్రం తీసుకోవాలనీ ఆదేశించారు. రాష్ట్రంలో వెయ్యి మంది రవాణా శాఖ అధికారులు ఉంటే కోటి 80 లక్షల వాహనాలు ఉన్నాయని ప్రతి ఒక్కరు స్వీయ నిర్వహణ పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించని వాహనాలపై లైసెన్స్ సస్పెండ్ చేస్తున్నామని తెలిపారు. రవాణా శాఖ అధికారులు ట్రాఫిక్ చిల్డ్రన్ అవేర్నెస్ పార్క్ ఏర్పాటు పై నిర్లక్ష్యాన్ని వీడాలని హెచ్చరించారు. ఆర్టీసీ కళా భవన్ లో రోడ్ సేఫ్టీ మంత్ కార్యక్రమాన్ని ప్రారంభించి గత 30 సంవత్సరాలుగా డ్రైవింగ్ చేస్తున్న ఒక్క ప్రమాదం కూడా జరగని డ్రైవర్లను అభినందించి సత్కరించారు. ఆర్టీసీ లో 20 వేల మంది డ్రైవర్లు ,10 వేల బస్సులు ప్రతి రోజు 60 లక్షల మంది ప్రయాణికులు ,39 లక్షల కిలోమీటర్లు లైఫ్ లైన్ అని కొనియాడారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ 2026 లో పాత బకాయిలు పోయి మరింత లాభాల్లోకి వచ్చేలా అందరం కృషి చేద్దామని వెల్లడించారు.ఆర్టీసీ ప్రమాదాలను జీరో కి తగ్గించడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు.

స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ మాట్లాడుతూ వాహనాల ఫిట్నెస్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కమర్షియల్ వాహనాలను కట్టడి చేయాలని సూచించారు. హెవీ డ్రైవర్లకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వాలని , వైద్య పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రమాదాలను నివారించడానికి ఒక సంవత్సర కాలంలో 100 బ్లాక్ స్పాట్ గుర్తించి తొలగించారని అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొనాలని సూచించారు.. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ లో ప్రతి లక్ష కిలోమీటర్లకు 0.07 శాతం ప్రమాదాలు ఉన్నాయని, సంవత్సర కాలంలో 600 ప్రమాదాలు జరిగాయని తెలిపారు.ప్రమాదాలు తగ్గించడానికి ప్రతి డిపో లో డ్రైవర్లకు శిక్షణ ఇవ్వడం , బ్రీత్ అనలైజర్ టెస్టులు చేయడం, సిబ్బందికి వైద్య పరీక్షలు , బస్సుల ఫిట్నెస్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలు శాశ్వత వికలాంగులు అయిన వారి కుటుంబాలు జీవితాంతం ఇబ్బందులు పడుతున్నాయన్నారు.ఆర్టీసీ ప్రతి సంవత్సరం 80 కోట్లు ప్రమాద బీమా చెల్లించడం జరుగుతుందనీ వెల్లడించారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి,ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జెటిసి లు చంద్రశేఖర్ గౌడ్, రమేష్ , శివలింగయ్య, డీటీసీ లు , స్టేట్ ఆర్టీఏ మెంబర్ నవీన్ ,జిల్లా ఆర్టీఏ సురేష్ లాల్ పాల్గొన్నారు



# శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**యాదగిరిగుట్ట, మహా :** తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నూతన సంవత్సరం సందర్భంగా గురువారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామి వారి అభిషేక సేవలో, ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.పూజల అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసారు,ఆలయ అధికారులు ఆయనకు స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈవో పాల్గొన్నారు.

## హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతిని
# విజయవంతం చేయాలి

## ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్ ల విడుదల

**జైనూర్ మహా :** అడవి బిడ్డల జీవనస్థితిగతులను అధ్యయనం చేయడానికి తమ జీవితాన్ని ధార పోసి ఆదివాసి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన దంపతులు ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్‌బెట్టి ఏలిజబెత్ అని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ కొనియడారు. వారి 39వ వర్ధంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం కొమరం భీమ్ అసిఫాబాద్ జిల్లా జైనూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో మాజీ గ్రంథాలయసంస్థ చైర్మన్ కనక యాదవరావు, జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్,మార్లవాయి సర్పంచ్ కనక ప్రతిభతో పాటు పలువురు ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఛలో మార్లవాయి కరపత్రాలను పోస్టర్లను విడుదల చేశారు,ఈ నెల 11,ఆదివారం రోజున జరిగే కార్యక్రమంలో ఆదివాసీలు, అభిమానులు వర్దంతి సభకు భారిగా తరలిరావలని కోరారు. నైజాం ప్రభుత్వ నిరంకుశ పాలనపైన ఆదివాసీలు పోరాటలు కొనసాగిస్తున్నతరుణంలో అప్పటి నిజాం నవాబు ఆదివాసీల స్థితిగతులను, జీవన మనుగడ గురించి పరిశోధనకు హైమాన్ డార్ఫ్ దంపుతులను మార్లవాయి ప్రాంతనికి పంపించినట్టు తెలిపారు. ఆదివాసీలలో తామూ



మమెకమై,ఆదివాసీలను చైతన్యవంతమైన జీవన విధానం వైపు ప్రయత్నించిన హైమన్ డార్ఫ్ దంపతులనును నేటికి ఆదివాసీలు తమ వాడిగానే చూస్తూ, మరణం అనంతరం కూడ, ఆయన వర్ధంతిని ఆదివాసీలు ఇప్పటికి ఘనంగా జరుపుకుంటూ వస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సర్మెడి మెస్రం భాదిరావు, ఆత్మ చైర్మన్ రమేష్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముఖిద్, మాజీ వైస్ ప్రసిడెంట్ చీర్లే లక్ష్మన్, సర్పంచ్ మడవి లక్ష్మన్,మెస్రం అంబాజీ,మార్కెట్ కమిటి డైరక్టర్ లు కనక గంగారం, మండాడి లింగు పంద్ర శేఖు, ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా నాయకులు కుమ్రం శంకర్,మెస్రం శ్రీకాంత్, కేంద్రే విశాల్ , తోడసం రాజు,మాజీ సర్పంచ్ లు కుమ్రం శ్యాంరావు, మడవి భీంరావు తదితరులు ఉన్నారు

# హ్యాపీ న్యూ ఇయర్ రేవంత్ అన్న..

- **ముఖ్యమంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వెలిచాల రాజేందర్ రావు..**
- **కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగరాలి..**
- **మేయర్ పీఠం దక్కించుకోవాలి..**
- **సీఎం రేవంత్ రెడ్డి సూచన..**

**కరీంనగర్ మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం హైదరాబాదులో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు ముఖ్యమంత్రి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాజేందర్ రావు పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. కరీంనగర్ నియోజకవర్గంలో 20 గ్రామాలు ఉండగా ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 11 గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఒంటి చేత్తో గ్రౌండ్లో



ఉండి గెలిపించానని ముఖ్యమంత్రి కి రాజేందర్ రావు వివరించారు. సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే కరీంనగర్ రూరల్ కొత్తపెల్లి మండలాలపై ప్రత్యేక దృష్టి సాధించానని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక నుంచి వారి గెలుపు కోసం అర్ధరాత్రి వరకు ప్రచారం నిర్వహించానని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా వారికి అన్ని రకాలుగా వెన్నుదన్నుగా ఉండి 11 మంది సర్పంచులను గెలిపించానని తెలిపారు. కరీంనగర్ నగరం తో పాటు కరీంనగర్ రూరల్ కొత్తపెల్లి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రౌండ్లో ఉండి వర్క్ చేస్తున్నానని ముఖ్యమంత్రికి వివరించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతము. సర్పంచుల గెలుపులో కీలక పాత్ర పోషించిన రాజేందర్రావును ప్రత్యేకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. రాజేందర్ రావు పనితీరుపై సంతోషం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో కరీంనగర్ నగర పాలక సంస్థ పై కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేయడం లక్ష్యంగా పనిచేయాలని రాజేందర్ రావుకు ముఖ్యమంత్రి సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి మేయర్ పీఠం దక్కించుకునేలా క్రియాశీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చెప్పారని రాజేందర్రావు పేర్కొన్నారు. నూతన సంవత్సరం వేళ కాంగ్రెస్ పార్టీ బలోపేతంతో పాటు సర్పంచ్ ఎన్నికల్లో 11 మందినీ గెలిపించడంపై సీఎం రేవంత్ రెడ్డి వెన్నుతట్టి ప్రోత్సహించి సంతోషం వ్యక్తం చేశారని రాజేంద్ర రావు పేర్కొన్నారు.

# శభాష్ కరీంనగర్ పోలీస్..

- **మందు తాగి వాహనాలు నడిపిన.. ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘించిన వారిపై ఉక్కు పాదం**
- **నూతన సంవత్సర వేడుకల వేళ..**
- **కరీంనగర్ పోలీసుల కఠిన నిఘా..**
- **ఒకే రాత్రిలో 281 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు**
- **నంబర్ ప్లేట్.. సరైన ధ్రువపత్రాలు లేని 224 వాహనాలు సీజ్**
- **కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం**

**కరీంనగర్ మహా :** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు ఉక్కు పాదం మోపారు. డ్రంక్ అండ్ డ్రైవ్: మద్యం తాగి వాహనాలు నడిపిన 281మందిపై కేసులు నమోదు చేశారు. ప్రమాదాల నివారణే



ధ్యేయంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో పట్టుబడిన 281 వాహనాలను సీజ్ చేశారు. అదేవిధంగా కమీషనరేట్ వ్యాప్తంగా నంబర్ ప్లేట్ లేని లేదా సరైన ధ్రువపత్రాలు లేని 224 వాహనాలను సీజ్ చేశారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు.. నిబంధనలు పాటించని వాహనదారులపై భారీగా జరిమానాలు విధించారు. కాంటాక్ట్ ఈచలాన్: 68 కేసులు (రూ. 35,000 జరిమానా). నాన్‌కాంటాక్ట్ ఈచలాన్: 1025 కేసులు (రూ. 4,97,875 జరిమానా). మొత్తం చలాన్లు: 1267 కేసులు నమోదు చేసి, రూ. 6,24,920 జరిమానా విధించారు. ఈ సందర్భంగా సిపి గౌష్ ఆలం మాట్లాడుతూ.. ప్రజల రక్షణ




కోసం పోలీసులు రాత్రంతా విధుల్లో ఉండి నిఘా కొనసాగించారని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే ప్రమాదాల పట్ల అవగాహన కల్పించినప్పటికీ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. తమ శాఖ తరపున పకడ్బందీ చర్యలు తీసుకోవడం వల్ల అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని ఆయన తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించిన ప్రజలకు మరియు అంకిత భావంతో పనిచేసిన పోలీస్ సిబ్బందికి సిపి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# గ్రేటర్ హైదరాబాద్ మ్యాప్‌లో పెను మార్పులు

## మారనున్న జిల్లాల హద్దులు.. వేగవంతమైన పునర్విభజన కసరత్తు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాజధాని భాగ్యనగరం మరో చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. కేవలం భౌగోళికంగానే కాకుండా పాలనాపరంగా కూడా హైదరాబాద్ ముఖ చిత్రాన్ని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పోలీస్ కమిషనరేట్లు, జిల్లాల సరిహద్దులు వేర్వేరుగా ఉండటం వల్ల తలెత్తుతున్న పాలనాపరమైన చిక్కులకు ముగింపు పలకాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాల పునర్విభజన ప్రక్రియకు సంబంధించిన కసరత్తు వేగవంతమైంది.




### కమిషనరేట్లే జిల్లాలకు ప్రాతిపదిక

ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పోలీస్ కమిషనరేట్ల హద్దులు ఒకలా, రెవెన్యూ జిల్లాల హద్దులు మరోలా ఉన్నాయి. దీని వల్ల శాంతిభద్రతల పరిరక్షణలోనూ, రెవెన్యూ సేవల్లోనూ సమన్వయ లోపం ఏర్పడుతోంది. దీనిని అధిగమించడానికి కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌తోపాటు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిని ప్రాతిపదికగా తీసుకొని జిల్లాల సరిహద్దులను మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు.

### హైదరాబాద్ జిల్లా కొత్త రూపు

ప్రస్తుతం ఉన్న హైదరాబాద్ జిల్లా పరిధిలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. నగరం మధ్యలో ఉన్న 16 మండలాల్లో కొన్నింటిని ఇతర జిల్లాల్లోకి మార్చడం ద్వారా పాలనను సులభతరం చేయనున్నారు. మల్కాజిగిరిలోకి కీలక మండలాలు .... సికింద్రాబాద్ పరిధిలోకి తిరుమలగిరి, మారేడ్‌పల్లి మండలాలను మల్కాజిగిరి జిల్లాలోకి చేర్చనున్నారు. బేగంపేట మార్పు.... అమీర్‌పేట మండలంలోని కీలకమైన బేగంపేట ప్రాంతం కూడా మల్కాజిగిరిలోకి మార్చాలని చూస్తున్నారు.

### దక్షిణ హైదరాబాద్ విస్తరణ:

హైదరాబాద్ జిల్లా సరిహద్దులు శంషాబాద్, రాజేంద్రనగర్ వైపు విస్తరించనున్నాయి. అయితే సదరు మండలాల్లో జీహెచ్ఎంసీ పరిధి ఎంత వరకు ఉంటుందో అంత వరకు మాత్రమే హైదరాబాద్ జిల్లాలోకి వస్తుంది.

### మేడ్చల్- మల్కాజిగిరి విస్తరణ

మల్కాజిగిరి జిల్లా ఇప్పుడు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధి ఎంత వరకు ఉందో అంత వరకు విస్తరిస్తారు. రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్, హయత్ నగర్ మండలాలు ఇకపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో కలవనున్నాయి. అంటే ఈ లెక్క ప్రకారం ఎల్బీ నగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలు పూర్తిగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోకి రానున్నాయి.

### రెండుగా రంగారెడ్డి జిల్లా

పరిపాలన సౌలభ్యం కోసం రంగారెడ్డి జిల్లాను రెండుగా విభజించనున్నారు. ఐటీ హబ్‌లు, భారీ పరిశ్రమలు, గేటెడ్ కమ్యూనిటీలతో ఉన్న ప్రాంతాలను ఒక జిల్లాగా, గ్రామీణ ప్రాంతాలను మరో జిల్లాగా మార్చనున్నారు. సైబర్‌రాబాద్‌పోలీస్ కమిషనరేట్ పరిధి మొత్తాన్ని కలిపి రంగారెడ్డి అర్బన్ జిల్లాగా మార్చనున్నారు. కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిని రంగారెడ్డి రూరల్ జిల్లాగా మారుస్తారు. ఇందులో షాద్‌నగర్, శంషాబాద్ రూరల్, చేవెళ్ల, ఆమనగల్లు, మహేశ్వరం వంటి మండలాలు ఉంటాయి. ఈ భారీ మార్పులకు సంబంధించిన డ్రాఫ్ట్ త్వరలోనే విడుదల కానుంది. 2027లో జనాభా లెక్కల కంటే ముందే ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు సెన్సస్ జరగనుంది. జనవరి లోపు పునర్విభజన ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# బిగ్ స్కామ్‌పై వెబ్ సిరీస్

## విడుదలపై ఆంక్షల ఎత్తివేత

సత్యం కంప్యూటర్స్ కుంభకోణం 2009లో దేశాన్ని కుదిపేసింది. ఈ స్కామ్ ఆధారంగా నిర్మించిన 'బ్యాడ్ బాయ్ బిలియనీర్స్: ఇండియా' డాక్యుమెంటరీ సిరీస్ ఎట్టకేలకు విడుదల కానుంది. ఈ సిరీస్ విడుదలపై ఉన్న ఆంక్షలను సిటీ సివిల్ కోర్టు ఎత్తివేసింది. 2020లోనే విడుదల కావాల్సిన ఈ సిరీస్‌ను నిలిపివేయాలని బైర్రాజు రామలింగరాజు సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. దీంతో సుమారు 5 ఏళ్ల తర్వాత ఈ కేసులో న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. 'బ్యాడ్ బాయ్ బిలియనీర్స్' డాక్యుమెంటరీ విడుదలను ఆపాలని బైర్రాజు రామలింగరాజు సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. ఆయన తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఇందులో అన్నీ అర్ధ సత్యాలు ఉన్నాయని తెలిపారు. అయితే, ఈ సిరీస్‌ను నిర్మిస్తున్న నెట్‌ఫ్లిక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సర్వీసెస్ ఇండియా కూడా సిరీస్ రిలీజ్ కోసం ఒక పిటీషన్ దాఖలు చేసింది. నెట్‌ఫ్లిక్స్ తరపు న్యాయవాది బొమ్మినేని వివేకానంద బలంగా తన వాదనలు వినిపించారు. పత్రికల ద్వారా బహిరంగమైన డాక్యుమెంట్ల ఆధారంగా ఈ సిరీస్‌ను రూపొందించారని దీంతో పిటిషనర్ వ్యక్తిగత జీవితంపై ఎలాంటి ప్రభావం చూపదని తెలిపారు. దేశంలో జరిగిన చారిత్రక మోసాన్ని ప్రజలకు తెలపడమే తమ ఉద్దేశమని ఆయన అన్నారు. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం వెబ్ సిరీస్ విడుదలకు ఎలాంటి ఇబ్బంది లేదని కోర్టు సూచించింది.

### కనుమరుగైన బ్రాండ్..

స్కామ్‌లో కూరుకుపోయిన కంపెనీని విక్రయించేందుకు అప్పటి ప్రభుత్వం స్వయంగా రంగంలోకి దిగి ఒక టీమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో టెక్ మహీంద్రా... సత్యంను చేజిక్కించుకుని దాని పేరును మహీంద్రా సత్యంగా మార్చింది. ఆతర్వాత మహీంద్రా సత్యంకూడా టెక్ మహీంద్రాలో పూర్తిగా విలీనంకావడంతో సత్యం కంపెనీ పేరు కాలగర్భంలో కలిసిపోయింది.





# న్యూ ఇయర్ వేడుకల వేళ సన్నీ లియోన్‌కి షాక్..

## ఈవెంట్ రద్దు ..!

కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రం మధురలో నిర్వహించాల్సిన బాలీవుడ్ నటి సన్నీ లియోన్ డీజే షో చుట్టూ నెలకొన్న వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. స్థానిక సాధువులు, ధార్మిక సంస్థలు, భక్తుల తీవ్ర అభ్యంతరాల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. శ్రీకృష్ణ జన్మభూమిగా ప్రసిద్ధి చెందిన మధురలోని ఒక ప్రతిష్ఠాత్మక హోటల్‌లో జనవరి 1వ తేదీ రాత్రి సన్నీ లియోన్ డీజే షో నిర్వహించాలని నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. నూతన సంవత్సర స్వాగతంగా రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు జరిగే ఈ ఈవెంట్‌కు టికెట్ల విక్రయాలు కూడా పూర్తయ్యాయి. సుమారు 300 మంది అతిథుల కోసం కబానా, హట్ వంటి లగ్జరీ సీటింగ్ ఏర్పాట్లు చేసినట్లు హోటల్ యాజమాన్యం వెల్లడించింది. అయితే ఈ ఈవెంట్‌కు సంబంధించిన సమాచారం బయటకు రావడంతో బ్రజ్ ప్రాంతానికి చెందిన సాధువులు, ధార్మిక సంఘాలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశాయి. మధుర వంటి ఆధ్యాత్మిక నగరంలో ఇలాంటి వినోద కార్యక్రమాలు నిర్వహించడం వల్ల నగర పవిత్రతకు భంగం కలుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. భజనలు, కీర్తనలతో మార్మోగాల్సిన శ్రీకృష్ణ జన్మభూమిలో అశ్లీలతను ప్రోత్సహించే ప్రదర్శనలు సహించబోమని హెచ్చరించారు. ఈ విషయమై మధుర జిల్లా మెజిస్ట్రేట్‌కు సాధువులు ఫిర్యాదు చేయడంతో పాటు నిరసనలు చేపట్టారు. వ్యతిరేకత రోజురోజుకూ పెరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. శ్రీకృష్ణుడు పుట్టిన పవిత్ర స్థలంలో ఇలాంటి షోలు నిర్వహించడం తగదని స్థానికులు తీవ్రంగా మండిపడ్డారు. పరిస్థితిని గమనించిన హోటల్ యజమాని మితుల్ పాఠక్ సన్నీ లియోన్ డీజే షోను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సన్నీ లియోన్‌ను కేవలం ఒక కళాకారిణిగానే ఆహ్వానించామని, చట్టపరమైన అనుమతులు ఉన్నప్పటికీ సమాజం, సాధువుల మనోభావాలను గౌరవించడం తమకు ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. బ్రజ్ సంప్రదాయాలకు విరుద్ధంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించబోమని, శాంతియుత వాతావరణాన్ని కాపాడటమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. దీంతో మధురలో నెలకొన్న ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పడినట్లైంది.

# టాలీవుడ్ హారర్ థ్రిల్లర్..

టాలీవుడ్ హీరో నవీన్ చంద్ర గతేడాది వరుస సినిమాలతో అభిమానులను అలరించాడు. ఇటీవలే కన్నడ ఇండస్ట్రీలోనూ గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు. కిచ్చా సుదీప్ హీరోగా వచ్చిన మార్క్ చిత్రంలో కనిపించారు. హారర్, సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన నవీన్ చంద్ర మరో సినిమా థియేటర్లలో సందడి చేసేందుకు వచ్చేస్తోంది.నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం హనీ. ఈ సైకలాజికల్ హారర్ మూవీకి కరుణ కుమార్ దర్శకత్వం వహించారు. ఓవా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించారు.





# మళ్లీ వచ్చేస్తోంది..!

హారర్ చిత్రాలకు ప్రత్యేకంగా ఫ్యాన్ బేస్ ఉంటుంది. ఇలాంటి థ్రిల్లర్స్ ఎన్ని వచ్చినా ఆడియన్స్‌కు బోర్ అనిపించదు. అందుకే అలాంటి సినిమాలనే సీక్వెల్స్ సైతం తెరకెక్కిస్తున్నారు. తాజాగా మరో హారర్ మూవీ సీక్వెల్ కూడా సిద్ధమవుతోంది. గతంలో రిలీజై ప్రేక్షకులను భయపెట్టిన డీమాంటి కాలనీ, డీమాంటీ కాలనీ-2 చిత్రాల గురించి మనందరికీ తెలిసిందే. ఈ సిరీస్‌లో మరోసారి ఆడియన్స్‌ను భయపెట్టేందుకు వచ్చేస్తున్నారు. ఈ సూపర్ హిట్ సిరీస్‌లో డిమాంటీ కాలనీ-3 కూడా వచ్చేస్తోంది. ఇవాళ న్యూ ఇయర్ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ చిత్రంలో అరుల్ నిధి, ప్రియా భవానీశంకర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో వచ్చిన రెండు పార్టులు ఆడియన్స్ వెన్నులో వణుకు పుట్టించాయి. ఈ మూవీపై కూడా అదేస్థాయిలో అంచనాలు నెలకొన్నాయి. తాజాగా రిలీజైన పోస్టర్ చూస్తుంటే మరోసారి భయపెట్టడం ఖాయమని స్పష్టంగా కనిపిస్తోంది. ఈ చిత్రం కొత్త ఏడాది సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుందని మేకర్స్ ప్రకటించారు.



# అపురూపమైన అవకాశం

మంచి రోజులు మొదలైతే, అవి కొన్నేళ్లపాటు సాగుతూనే ఉంటాయి. ఆ సమయంలో జాగ్రత్తపడితే ఇక జీవితం అంతా ఆనందమే. కన్నడ కస్తూరి రుక్మిణి వసంత్‌కు ప్రస్తుతం మంచి రోజులు నడుస్తున్నాయి. 'సప్తసాగరాలు దాటి' సినిమా ఏ ముహూర్తాన తెలుగులో విడుదలైందో అక్కడి నుంచి రుక్మిణి వసంత్‌కి శుక్ర మహర్దశ మొదలైంది. ఆమె తాజా విజయం 'కాంతార: చాప్టర్ 1' దాదాపు రూ.800 కోట్లు వసూలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కన్నడ అగ్రహీరో యష్ హీరోగా రూపొందుతున్న 'టాక్సిక్' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నది రుక్మిణి వసంత్.

అలాగే తారక్, ప్రశాంత్‌నీల్ సినిమాలోనూ రుక్మిణి వసంతే కథానాయిక. ఇప్పటికే ఈ సినిమాకి సంబంధించిన చిత్రీకరణలో కూడా ఆమె పాల్గొన్నదని సమాచారం. ఇదిలావుంటే.. ఈ అందాలభామను ఇప్పుడు అపరూపమైన మరో అవకాశం వరించిందని తెలిసింది. రామ్‌చరణ్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. 'ఆర్‌సీ 17' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమాలో రుక్మిణి వసంత్ కథానాయికగా ఎంపికైందట. ఇదే నిజమైతే ఈ అమ్మడి దశ తిరిగినట్టే. ఇప్పటికే సుకుమార్ కథను రెడీ చేశారనీ, ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయనీ, వచ్చే ఏడాది జూలైలో ఈ సినిమా సెట్స్‌కి వెళుతుందని వినికిడి.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034